# ధర.. కన్నీటి ధార

రెక్కలు ముక్కలు చేసుకుని ఆరుగాలం శ్రమిస్తూ పంటలు సాగు చేస్తున్నరైతులకు చివరికి కన్నీరే మిగులుతోంది. ధరలు పతనం కావడంతో పెట్టుబడి కూడా చేతికి అందక దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. కర్బూజ ధర రోజురోజుకు పతనం కావడంపై ఇదేమీ ఘోరమంటూ లబోదిబోమంటున్నారు. తీపి పంచాల్సిన కర్బూజ పంట ఈసారి రైతన్నలకు చేదు మిగిల్చింది.

- పతనమైన కర్బూజ ధరలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- కిలో రూ. 15 నుంచి రూ.4కు పడిపోయిన ధర

**అట్లూరు :** ఆరుగాలం కష్టపడి పది మందికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు కష్టాలే తప్పా లాభాలు దక్కడం లేదు. చీడపీడలు, అతివృష్టి, అనావృష్టి, వాతావరణ మార్పులతో రైతన్న అతలాకుతలం అవుతున్నాడు. సంప్రదాయ పంటలతో నష్టాల పాలవుతున్న అన్నదాతలు స్వల్పకాలిక పంటలైన తీగజాతి కర్బూజ (కలింగర) సాగు వైపు అడుగు లేశారు. ఈ కర్బూజలో కూడా నల్లరకం పంటను సాగు చేశారు. ఆశించిన మేర దిగుబడి కూడా వచ్చింది. అయితే కాయలు కోత దశకు వచ్చే సరికి ధర అమాంతం కుప్పకూలింది. దీంతో కనీసం పెట్టుబడులు కూడా చేతికి అందని విధంగా నష్టాలు మిగిల్చింది.

**ఎకరాకు రూ. లక్ష పెట్టుబడి**

ఈ కర్బూజ సాగుకు పెట్టుబడి ఎక్కువే. అయినా రైతులు వెనుకంజ వేయలేదు. జిల్లావ్యాప్తంగా సుమారు 500 హెక్టార్లలో నల్ల రకం కర్బూజ సాగు చేశారు. సేద్యం మొదలుకుని విత్తనం మల్చింగ్, అలాగే క్రిమి కీటకాల నివారణ కోసం పిచికారి మందులు. డ్రిప్, ఎరువులు, కూలీల ఖర్చులు మొత్తం ఎకరాకు లక్ష రూపాయల వరకూ ఖర్చు చేశారు. ఎకరాకు 10 నుంచి 15 టన్నులు దిగుబడి వచ్చి మంచి ధర ఉంటే ఖర్చులు పోనూ, ఎకరాకు లక్ష నుంచి రెండు లక్షలు రూపాయలు ఆదాయం వస్తుంది.

**పడిపోయిన ధరలు**

జనవరి, ఫిబ్రవరి, మార్చి 25వ తేదీ వరకు టన్ను రూ.15 నుంచి రూ.20 వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం టన్ను రూ.6 వేల నుంచి రూ.4 వేలకు పడిపోయింది. ధరలు బాగా పడిపోవడంతో సాగు ఖర్చులు కూడా రావడం లేదని రైతు ఆవేదన చెందుతున్నాడు. పంటసాగు గిట్టుబాటు కావడం లేదనే ఆందోళన అన్నదాతల్లో నెలకొంది.



ధర లేక తోటలోనే కర్బూజా కాయలను వదిలేసిన రైతులు

**మార్కెటింగ్ సౌకర్యం లేక అవస్థలు**

కర్బూజ రైతుల పరిస్థితి వర్ణణాతీతం. అనంతపురం జిల్లాలో దోసను విస్తారంగా సాగు చేశారు. అక్కడ రైతులకు బెంగళూరుతో పాటు హైదరాబాద్ మార్కెట్ దగ్గరలో ఉంటుంది. దీంతో రవాణా ఖర్చు తక్కువగా ఉంటుంది. అలాగే వ్యాపారస్తులు అనంతపురం జిల్లాలో కొనుగోలు చేసి మెట్రో నగరాలకు తరలిస్తున్నారు. కడప జిల్లాలో మార్కెట్ లేక పోవడంతో ఇక్కడ నుంచి రవాణా ఖర్చులు అధికం అవుతుండడంతో వ్యాపారస్తులు అనంతపురం వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో పండిన కాయలను కొనేందుకు అక్కడి వ్యాపారస్తులు మొగ్గుచూపడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకుని అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్లు కర్బూజ పంటకు కూడా గిట్టుధర కల్పించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కోలుకోలేని నష్టం**



మార్కెట్లో మంచి ధర ఉంటుందని ఐదు ఎకరాల్లో కర్బూజ సాగు చేశాను. సుమారు ఐదు లక్షల రూపాయలకు పైగా ఖర్చు వచ్చింది. 60 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. సగం కాయలు మార్కెట్ చేసు కోలేక తోటలోనే కుళ్లిపోయాయి. సగం పెట్టుబడి కూడా రాలేదు. కోలుకోలేని విధంగా నష్టపోయాను.

- మాలే శివరామిరెడ్డి, కర్బూజ రైతు, అప్పరాజుపేట, బద్వేలు మండలం

**ప్రభుత్వం ఆదుకోవాలి**



నేను మూడెకరాల్లో కర్బూజ సాగు చేశాను. తీగలు బాగా సాగి దిగుబడి కూడా అధికంగానే వచ్చింది. ప్రస్తుతం టన్ను ధర రూ.5 వేలకు పడిపోయింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ముందుకు రాలేదు. దీంతో ట్రాక్టర్లతో తీసుకెళ్లి పల్లెల్లో అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- చిన్నమునిరెడ్డి, కర్బూజ రైతు, కామసముద్రం, అట్లూరు మండలం

**అధిక దిగుబడితో ధర పతనం**



గతంలో ఇలాంటి పంటలు చాలా తక్కువ మంది రైతులు సాగు చేసేవారు. దీంతో మార్కెట్లో ధర బాగా ఉండేది. ఈ ఏడాది రైతులు అంతా ఒకే అదునులో సాగు చేశారు. అధికంగా దిగుబడి రావడంతో మార్కెట్లో ధర తగ్గింది. రైతులు స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకునే విధంగా ఎదగాలి.

- జయభరత్‌రెడ్డి, ఉద్యానవన అధికారి, బద్వేలు

## నేటి నుంచి గంగజాతర



పూజలందుకుంటున్న గంగాభవాని

**దువ్వూరు :** మండలంలోని చింతకుంట గ్రామంలోని గంగాభవాని ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు గంగజాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు గంగాభవాని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 18న శుక్రవారం ఉదయం కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, రాత్రి పెద్దరాజు కథా గానం ఉంటుందని పేర్కొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు జాంబవంతుని జల్లి స్నానం, ఆకుపూజ, మధ్యాహ్నం 2 గంటలకు గంగాభవాని అమ్మవారికి లోమడ వీరకృష్ణారెడ్డి ఇంటి వద్ద నుండి పానక పందారం జరుగుతుందని తెలిపారు. న్యూ కేటగిరి వృషభరాజములకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు వరుసగా 1వ, 2వ, 3వ, 4వ, 5వ, 6వ బహుమతులు అందిస్తామని వివరించారు. శ్రీరామ మహిళల కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. భక్తులు జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## క్లుప్తంగా

### నేటి నుంచి అంకాలమ్మ తిరునాల

**మైదుకూరు :** మైదుకూరులో శుక్రవారం నుంచి 21వ తేదీ సోమవారం వరకు గ్రామ దేవత అంకాలమ్మ తిరునాల నిర్వహించనున్నారు. స్థానిక వనిపెంట రోడ్డులోని ఆలయంలో 18వ తేదీ శుక్రవారం బియ్యం కొలత, 19వ తేదీ శనివారం శుద్ధ భూతి, 20వ తేదీ ఆదివారం బోనాలు, సుడిబండి ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. 21వ తేదీ సోమవారం వృషభరాజములకు బండలాగుడు పోటీలు, మనుషులకు గుండు ఎత్తే పందేలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ధర్నాను జయప్రదం చేయండి

**ప్రొద్దుటూరు :** గుండ్రేవుల ప్రాజెక్టు, రాజోలి రిజర్వాయర్ కోసం ఆళ్లగడ్డ తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించనున్నట్లు రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి సమితి అధ్యక్షుడు శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి గుండ్రేవుల సాధన, కేసీ కెనాల్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ ధర్నా నిర్వహిస్తున్నారని, విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

### వైభవంగా జెండా పండుగ



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

**ప్రొద్దుటూరు రూరల్ :** మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కానపల్లె గ్రామంలో వైభవంగా దస్తగిరి స్వామి జెండా పండుగ నిర్వహించారు. గ్రామంలో దర్గాలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రి భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి గ్రామ పురవీధుల్లో నగరి జెండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ పెద్దలు పేర్కొన్నారు. అనంతరం దర్గా వద్ద మలీద పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు.

### ఘనంగా బ్రహ్మోత్సవాలు

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఏడవ రోజు స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ముక్తిరామలింగేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి, ప్రధాన కలశ పూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, దశ హారతుల కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి గంగా, రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పెద్ద శేష వాహనంపై ఆశీనులను చేసి పుర వీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్తల రాజారెడ్డి, ఈఓ శ్రీధర్, పాలకమండలి సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఆలయ భూముల వేలం

**రాజుపాళెం :** మండలంలోని వెల్లాల శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఆలయ ఈఓ కేవీ రమణ, దేవాదాయ శాఖ ప్రొద్దుటూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన వేలం పాటలో రూ.5,84,100 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. మొత్తం 69.10 ఎకరాలకు గాను వేలం పాట నిర్వహించగా రూ.5,59,600 ఆదాయం రాగా, వెల్లాల పొలంలో 11.29 ఎకరాలకు సరైన ధర రాకపోవడంతో ఆ భూములను వేలం వాయిదా వేశామని తెలిపారు. భక్తులు సమర్పించిన వస్తువులకు వేలం నిర్వహించగా రూ.24,500 ఆదాయం వచ్చిందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్ పాల్గొన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

**బద్వేలు అర్బన్ :** లక్ష్మీపాలెం గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన అబ్బూరి నరసింహులు మద్యం బాటిళ్ల విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

### ప్రమాదంలో పెన్షనర్ల భవిష్యత్తు

**పోరుమామిళ్ల:** కేంద్ర ప్రభుత్వం లోకసభలో ప్రవేశపెట్టి పాస్ చేయించుకున్న పెన్షన్ సవరణ బిల్లుతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెను ప్రమాదం తప్పదని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల భవిష్యత్తును నడిరోడ్డు పాలు చేసే సీపీయస్‌ను రద్దు చేసి ఓపీయస్‌ను అమలు చేయాలని 15 సంవత్సరాలుగా పోరాడుతున్నామని పేర్కొన్నారు.ఈ సవరణ బిల్లు రాజ్యసభలో కూడా ఆమోదం పొందితే 50 లక్షల కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల పెన్షనర్లు నష్టపోతారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వరరెడ్డి, కన్వీనర్లు శివారెడ్డి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీవాణి



డాక్టర్ శ్రీవాణికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తున్న డాక్టర్ ఆనంద్‌బాబు

**ప్రొద్దుటూరు క్రైం :** ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీవాణి బాధ్యతలు తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుత సూపరింటెండెంట్ ఆనంద్ బాబు గురువారం డాక్టర్ శ్రీవాణికి బాధ్యతలు అప్పగించారు. ఆస్పత్రిలోని సీనియర్ సివిల్ సర్జన్‌కు సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## పోలీసులకు రక్షణగా ప్రజలు..!



రాజుపాళెం సమీపంలో దొంగలు వదిలి వెళ్లిన కారు

**చాపాడు :** దొంగలను పట్టుకునేందుకు వారిని వెంబడించిన పోలీసులకు రక్షణగా ప్రజలు నిలిచిన సంఘటన గురువారం చాపాడు మండలం వి.రాజుపాళెం గ్రామ సమీపంలో నెలకొంది. ప్రొద్దుటూరు, చాపాడు మండలం పోలీసులు, వి.రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకూ.. మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం ఇళ్లలో దొంగతనం చేసి పారిపోతున్న దొంగలను పట్టుకునేందుకు ప్రొద్దుటూరు రూరల్ పోలీసుస్టేషన్ పోలీసులు శ్రాయశక్తుల ప్రయత్నించారు. నెల్లూరు జిల్లా నియోజకవర్గ కేంద్రమైన కావలిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో అప్రమత్తమైన వైఎస్సార్ జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఇంటి దోపిడి దొంగలను పట్టుకునేందుకు వైఎస్సార్ జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో రంగంలోకి దిగిన ప్రొద్దుటూరు రూరల్ పోలీసుస్టేషన్ ఎస్ఐలు సురేష్, అరుణ్‌కుమార్‌రెడ్డిలు ప్రొద్దుటూరు నుంచి చాపాడు మండలంలో దొంగల వేట ప్రారంభించారు. ఈ క్రమంలో మండలంలోని తిప్పిరెడ్డిపల్లె వైపు దొంగలు కారులో వెళుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ సురేష్ దొంగలను వెంబడించారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామంలోని దొంగలు వెళ్లడం దీనిని గుర్తించని పోలీసులు రాజుపాళెం గ్రామం వైపు వెళ్లారు. పోలీసులు రాజుపాళెం సమీపంలో కారును రోడ్డుకు అడ్డుగా పెట్టారు. తిప్పిరెడ్డిపల్లె నుంచి వస్తున్న దొంగల కారు ఎస్ఐ సురేష్ వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ క్రమంలో ఇద్దరు దొంగలు కారులో నుంచి పరారీ కాగా పక్రుద్దీన్ అనే దొంగను పోలీసులు పట్టుకున్నారు. కావలి పట్టణంలో అనేక ఇళ్లలొ దొంగతనానికి పాల్పడి పారిపోతున్న వీరిపై పోలీసులు నిఘా పెట్టగా దొంగ దొరికాడని ఇందులో పాత్ర ఉన్న ఇతర దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.


## విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



దేవసాని ఆదిత్యారెడ్డి

**అట్లూరు :** విద్యారంగంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యారెడ్డి విమర్శించారు. గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబీఏ తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల్ని కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.3,900 కోట్లకు సంబంధించి కేవలం రూ.1,300 కోట్లు మాత్రమే విడుదల చేశారన్నారు. అదికూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువత పోరుకు పిలుపునిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తే నామ మాత్రంగా విడుదలు చేశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కళాశాలలో ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చి హామీలు గాలికి వదిలేశారని దయ్యబట్టారు. విద్యార్థులు, యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కౌన్సిలర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



కౌన్సిలర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**బద్వేలు అర్బన్ :** ఇటీవల హైదరాబాద్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై శస్త్రచికిత్స చేయించుకుని బద్వేలులోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ, ఆయన సతీమణిని గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అన్ని జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, బూత్‌కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పుత్తాశ్రీరాములు, పోలిరెడ్డి, మాధవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

**పరామర్శ**

**గోపవరం :** ఇటీవల గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న మండల పరిధిలోని సంగసముద్రం గ్రామానికి చెందిన వర్ధా కొండయ్య, రోడ్డు ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణలను గురువారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి పరామర్శించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గోపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**బద్వేలు అర్బన్ :** మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ పట్టణ నాయకులు మస్తాన్ షరీఫ్, యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శులు సత్యరాజు పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు :** స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు మూడో రోజు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి మాట్లాడుతూ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికుల సమస్యలను పరిష్కరించి టెక్నికల్ వేతనాలు ఇవ్వాలని, పనిముట్లు, యూనిఫాం ఇవ్వాలని తెలిపారు. కరోనా కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వీసును 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించండి



మైదుకూరు : తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



బద్వేలు అర్బన్ : కరపత్రాలు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**మైదుకూరు :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను గురువారం యూటీఎఫ్ నాయకులు మైదుకూరు మండలంలోని పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతపై ఓబులాపురం పప్పనపల్లె, చెర్లోపల్లె గ్రామాల్లో వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ బడిలోనే తమ పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ బడిని బలోపేతం చేయాలన్నారు. ఊరి బడిని కాపాడుకునే బాధ్యత ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రుల మీద ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం సంస్కరణల పేరుతో పాఠశాలల విలీనం చేస్తుందని దానిని ఎక్కడికక్కడ విద్యార్థుల తల్లిదండ్రులే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఊరి బడిని కాపాడుకునేందుకు తల్లిదండ్రులను చైతన్యపరిచి యూటీఎఫ్ రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్ పీరా, పాండురంగయ్య, రాజమ్మ, వరలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ బడిలోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి**

**బద్వేలు అర్బన్ :** సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం అనే నినాదంతో గురువారం మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె, గుంతపల్లె, సురేంద్రనగర్ గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కార్పొరేట్ విద్యపై ఉన్న మోజు, విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న సవతితల్లి ప్రేమ వల్ల నానాటికీ ప్రభుత్వ బడి నిరాదరణకు గురవుతోందన్నారు. కార్పొరేట్ మాయాజాలంలో పడి విద్యార్థుల తల్లిదండ్రులు లక్షలాది రూపాయలు ఫీజులు వెచ్చిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. అన్ని పోటీల్లో నెగ్గి ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా కొనసాగుతున్న వారే మెరుగైన బోధన చేయగలరనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. అమ్మ ఆప్యాయత, మానవత్వం పరిమళం, ఎదుటి వ్యక్తులు కష్టాల్లో ఉంటే సహాయపడటం, గౌరవంగా మెలగడం, నైతిక విలువలు, సమాజం పట్ల బాధ్యత వంటివి అన్నీ ప్రభుత్వ బడి మాత్రమే నేర్పిస్తుందన్నారు. పాలకులు కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ బడికి పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ఊరిబడిని కాపాడుకునేందుకు నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మస్తాన్‌వలి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### సమస్యలపై ఆర్టీసీ ఉద్యోగులు పోరుబాట

**మైదుకూరు :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైదుకూరు ప్రజా రవాణా సంస్థ (ఆర్టీసీ) డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో ఉద్యోగులు సమస్యలను తెలిపే ప్లకార్డులను చేతపట్టి డిపో గేటు వద్ద కొద్ది సేపు ధర్నా చేసి అక్కడి నుండి బస్టాండ్ ఇన్ గేట్, కడప రోడ్డు, అవుట్ గేట్ మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులకు ఓడీలు ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానం అమలు చేయాలని, అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో సెక్రటరీ వీఎస్ రాయుడు, డిపో అధ్యక్షుడు ఎస్.నాగరాజు, గ్యారేజ్ కార్యదర్శి వైఎస్ రాయుడు, సీసీఎస్ డెలిగేట్ ఎస్వీ నరసింహులు, ఎస్‌బీ రెడ్డి, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

### కానపల్లెలో అధికారుల పర్యటన

**ప్రొద్దుటూరు రూరల్ :** మండలంలోని కొత్తపల్లె పంచాయతీ కానపల్లె గ్రామంలో గురువారం ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి, ఈఓపీఆర్డీ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పర్యటించారు. గ్రామంలో దస్తగిరి స్వామి జెండా పండుగ, పెద్దమ్మ తల్లి దేవర మహోత్సవం జరుగుతున్న సందర్భంగా గ్రామంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యంపై వారు ఆరా తీశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.

## సీహెచ్‌ఓల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

**బద్వేలు అర్బన్ :** గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో 2019 నుంచి పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీహెచ్‌ఓ అసోసియేషన్ సభ్యులు సాకి ప్రభావతి, శీలం సుస్మిత కోరారు. గురువారం స్థానిక తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఆవరణలో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారిని తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి జీతం అందుతుండగా ప్రోత్సాహకం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుండేదని, అయితే సంవత్సర కాలంగా ప్రోత్సాహకం ఆగిపోయిందని, దీనిని కొనసాగించాలని కోరారు. అలాగే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సీహెచ్‌ఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అసోసియేషన్ సభ్యులు శిరీష, రాధ, జ్యోత్స్న, మీనా, హర్షిత, శుభలేఖ, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు

**మైదుకూరు :** మండలానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం 35 యూనిట్లు మంజూరు అయినట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ అందించే ఈ ఉపాధి యూనిట్లలో 33 శాతం మహిళలకు కేటాయించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఫ్లవర్ బొకే, డెకరేషన్, కార్ వాష్ సర్వీస్, ఫొటో వీడియోగ్రఫీ, ప్యాసింజర్ ఆటో, వర్మీ కంపోస్టు తయారీ, బేకరీ తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంక్ లోన్‌తోపాటు లబ్ధిదారు కూడా కొంత సొమ్ము భరించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. మొత్తం యూనిట్ విలువలో సబ్సిడీ ఉటుందని పేర్కొన్నారు. అర్హులు మే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా రేపు ర్యాలీ

**ప్రొద్దుటూరు కల్చరల్ :** వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం ముస్లిం జేఏసీ కమిటీ మెంబర్ సలీం పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శనివారం ఉదయం 9.30 గంటలకు వన్ టౌన్ వద్ద ఉన్న ముబారక్ షాదీ మంజిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ముస్లింలు, లౌకిక, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కేఎం సుభాన్ పాల్గొంటారని తెలిపారు.

## అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



మైదుకూరు : అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

**బద్వేలు అర్బన్ :** అగ్నిప్రమాదాల నివారణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.సుధాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణ – మార్గాలు అనే అంశంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇళ్ల నుంచి బయటకు వెళ్లేటపుడు టి.వి.స్విచ్‌లు, ఏసీలు మొదలగు విద్యుత్ పరికరాలను స్విచ్ఛాఫ్ చేసి వెళ్లడం క్షేమమని వివరించారు. అలాగే వేసవి సెలవుల్లో నీటి కుంటలు, కాలువల్లో ఈతకు దిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటిలో చిక్కుకున్న వారిని కాపాడే విధానాలను, బహుళ అంతస్తు భవనాలలో మంటల్లో చిక్కుకున్న పిల్లలను తాడు సహాయంతో ఎలా కిందకు దించుతారో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే బహుళ అంతస్తుల భవనంలో మంటలు ఆర్పే విధానం, సీఓటు, డీసీపీ యంత్రాలను ఉపయోగించే విధానాన్ని, గ్యాస్ లీకేజీ మంటలను ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించడంతో పాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.వెంకటరామిరెడ్డి, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**అగ్ని ప్రమాదాలపై పాఠశాలలో అవగాహన**

**మైదుకూరు :** అగ్ని ప్రమాదాలపై గురువారం స్థానిక అగ్ని మాపక కేంద్రం సిబ్బంది పాఠశాలలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ బి.సత్యరాజు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బహుళ అంతస్తులున్న భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా బయటికి రావాలో, పొగ గదిలో చిక్కుకున్న వారిని ఎలా బయటికి తీసుకుని రావాలో, నీళ్లలో పడిన వాళ్లను ఎలా రక్షించాలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 101కి ఫోన్ చేయాలని సూచించారు.

**పోరుమామిళ్ల :** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గురువారం పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బంది వైష్ణవి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. బహుళ అంతస్తుల భవనంలో ప్రమాదాలు జరిగినపుడు అందులో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో, ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరక్కుండా ఎలా కాపాడుకోవాలో అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్, సిబ్బంది ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, ఫైర్ సిబ్బంది సుబ్బయ్య, సుహాన్, సిద్దయ్య, మల్లికార్జునరెడ్డి, కేశవ, రవీంద్ర పాల్గొన్నారు.